చిన్నారి కథ... చలించిన హరీశ్‌రావు

విద్యార్థిని సాత్విక‌ను ఓదారుస్తూ భావోద్వేగానికి గురైన హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 19: రాజకీయాల్లో గంభీరంగా కనిపించే హరీశ్‌రావు.. ఓ చిన్నారి కథవిని.. కన్నీరు పెట్టుకున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై హరీశ్‌రావు శనివారం సిద్దిపేటలో 'భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి' పేరుతో ఓ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ రంజిత్ తల్లిదండ్రుల మాట వినాలని, పెద్దలను గౌరవించాలని, వారికి విలువ ఇవ్వాలని విద్యార్థులకు బోధించారు. అనంతరం పిల్లల మనోభావాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని సాత్విక మాట్లాడుతూ.. తాను రెండో తరగతిలో ఉన్నప్పుడే నాన్న చనిపోయాడని, అమ్మ కష్టార్జితంతోనే చదువుకుంటున్నానని చెప్తూ భోరున విలపించింది. అమ్మకు చేదోడుగా ఉంటానంటూ చెప్పింది. దీంతో హరీశ్‌రావు భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. సాత్వికను ఆత్మీయంగా అక్కున చేర్చుకుని, కార్యక్రమం పూర్తయ్యేంత వరకు తనతోనే కూర్చొబెట్టుకున్నారు. సాత్విక కుటుంబ పరిస్థితులపై ఆరా తీసి.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఆ తల్లి రోదనలు వినపడలేదా?

- పరిహారం ఇచ్చేది దేవుడెరుగు.. మీకు పరామర్శించే తీరకే లేదా?
- ఆ మంత్రులకు మానవత్వం లేదు
- బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి మండిపాటు

ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వద్ద మంత్రుల రోడ్‌షోలో చనిపోయిన పసికందును చూపి రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు(ఫైల్)

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): బిడ్డను కోల్పోయిన ఆ తల్లి రోదనలు మీకు (మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క) వినపడలేదా? కనపడలేదా? ములుగు రోడ్‌షోలో పాల్గొన్న మీరు మీ మూలాలనే మరిచారా? అని ఆ మంత్రులపై బీఆర్ఎస్ రాష్ట్ర నేత రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. తమ మూలాలను గిరిజన బిడ్డలు మళ్లీ గుర్తుచేయాలి అని పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నవమాసాలు మోసిన కన్నబిడ్డ కళ్లు కూడా తెరవకముందే నిండునూరేండ్లు నిండితే.. ఆ తల్లి గుండె ఎంత తల్లడిల్లిందో? ఆమె ఎంత మానసిక క్షోభకు గురైనదో? అన్న బాధ వర్ణణాతీతమని పేర్కొన్నారు. ఆ బాధ అక్షరాల్లో రాయలేనిదని, మాటల్లో వర్ణించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ పసికందు ప్రాణం పోయిందని తెలిసినా, మానవత్వం లేకుండా రోడ్‌షో చేస్తూ, చిరునవ్వులు చిందిస్తున్న ఆ ఇద్దరు మంత్రుల తీరుతో వారి నిజస్వరూపం తేటతెల్లమైందని చెప్పారు. ప్రజల పట్ల వారికున్న అంకిత భావం ఏపాటిదో తేటతెల్లమైందని మండిపడ్డారు. బిడ్డను కోల్పోయిన తల్లికి అభయం ఇవ్వని మీ అభివాదం ఎందుకు? అని నిలదీశారు. తమరు ములుగులో చేసింది రోడ్ షో కాదని, రోదన షో అని, ప్రాణాలు కోల్పోయిన ఆ చిన్నారి శవయాత్ర అని అభివర్ణించారు. మంత్రులుగా కాకుండా, కనీసం మనుషులుగానైనా మానవత్వంతో స్పందించి, అక్కడికక్కడే విచారణ చేపట్టి ఉండాల్సింది అని ఆయన అభిప్రాయపడ్డారు. పరిహారం సంగతి దేవుడెరుగు, కానీ ఆ బిడ్డను కోల్పోయిన తల్లిని పరామర్శించే తీరిక కూడా తమరికి లేదా? అని నిలదీశారు. తక్షణమే ములుగు ఏరియా దవాఖానలో జరిగిన అమానవీయ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బిడ్డను కోల్పోయిన ఆ తల్లికి మెరుగైన వైద్యం అందించాలని, వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ములుగులో పసికందు మృతిపై విచారణ

ములుగు, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : ములుగు ప్రభుత్వ దవాఖానలో పసికందు మృతి ఘటన నేపథ్యంలో కలెక్టర్ టీఎస్ దివాకర నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటుచేశారు. చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, వైద్యాధికారులు రణధీర్, సుధాకర్, జగదీశ్వర్, పద్మజ, భారతి, ప్రసాద్, డీడబ్ల్యూవో శిరీషతో పాటు హెడ్ నర్సు పద్మను నియమించారు. శనివారం అదనపు కలెక్టర్ మహేందర్‌జీ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటీ విచారణ జరిపింది. బండారుపల్లికి చెందిన రవళి దవాఖానలో అడ్మిట్ అయినప్పటి నుంచి డెలివరీ వరకు నమోదు చేసిన కేషీట్‌లను పరిశీలించి ఘటనపై చర్చించారు.

తెలంగాణలో డ్రైపోర్టు

జపాన్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డ్రైపోర్టును ఏర్పాటు చేయనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న ఆయన.. శనివారం టోక్యోలో జపాన్ తెలుగు సమాఖ్య నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్ ఫ్రంట్ పరిశీలించామని, నీరు మన సంస్కృతికి, అభివృద్ధికి ప్రతీక అని చెప్పారు. ఢిల్లీలో కాలుష్యం వల్ల అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్నారని, దీని నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నదని, అందుకే హైదరాబాద్‌లో మూసీ నదిని ప్రక్షాళన చేయాలని చెప్తున్నానని తెలిపారు. 'తెలంగాణ అభివృద్ధికి మీ అందరి సహకారం అవసరం. ఎవరికి చేతనైనంత వారు చేయగలిగింది చేస్తే ప్రపంచంతోనే మనం పోటీపడొచ్చు. మీ ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసు' అని రేవంత్ తెలిపారు.

తెలంగాణ పోలీసుగా గర్వించండి: డీజీపీ

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : దేశంలోనే ప్రథమ స్థానం పొందిన తెలంగాణ పోలీస్ శాఖలో పనిచేస్తున్నందుకు తాను గర్వపడుతున్నానని, మీరు కూడా గర్వపడాలని ఎస్‌హెచ్‌వోలకు డీజీపీ డాక్టర్ జితేందర్ సూచించారు. శనివారం ఎస్‌హెచ్‌వోల మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పనితీరు, విధానాలను పరిశీలించి మన పోలీస్ సిబ్బంది శిక్షణ, రిసెప్షన్, తదితర 32 అంశాలను బేరీజు వేయడం ద్వారా దేశంలోనే మొదటి స్థానాన్ని పొందామని తెలిపారు. ఎస్‌హెచ్‌వోల పనితీరు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ప్రవేశపెట్టామని తెలిపారు. శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ ఎం భగవత్ మాట్లాడుతూ.. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల్లో, సిబ్బందిలో మంచి పేరు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

ధాన్యం ఉత్పత్తిపై తలో మాట!

- 127 లక్షల టన్నుల ఉత్పత్తి అన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- 137 లక్షల టన్నులంటున్న పౌరసరఫరాల శాఖ
- కొనుగోళ్లలో కోతకే తేడాలా అన్న అనుమానాలు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): యాసంగి ధాన్యం ఉత్పత్తిపై మంత్రి ఉత్తమ్ ఒక మాట చెప్తుంటే.. పౌరసరఫరాల శాఖ మరో మాట చెప్తున్నది. సివిల్‌సప్లై భవన్‌లో శనివారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించిన మంత్రి.. ఈ యాసంగిలో 127.50 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. పౌరసరఫరాల శాఖ మాత్రం ఈ సీజన్‌లో 137.10 లక్షల టన్నుల దిగుబడిని అంచనా వేస్తున్నట్టు పేర్కొంది. మంత్రి, అధికారుల మధ్య ఏకంగా 10 లక్షల టన్నుల ధాన్యం తేడా ఉండటం గమనార్హం. ధాన్యం కొనుగోళ్లలో కోత పెట్టేందుకే దిగుబడిని తక్కువగా అంచనా వేస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో రికార్డ్‌స్థాయిలో ధాన్యం ఉత్పత్తి అవుతుందని పేర్కొన్నారు. ఇందుకు తగ్గట్టుగానే మొత్తం ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో 57 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా 127.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నామని అన్నారు. ఇందులో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. ఈ సంవత్సరం వానకాలం, యాసంగి సీజన్‌లు కలిపి 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని చెప్పారు. శుక్రవారం నాటికి 8.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరగా ఇప్పటికే 5.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని వెల్లడించారు. ఇందులో సన్నరకాలు 3.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండగా 1.98 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకాలని వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో 2.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సిద్ధంగా ఉందని చెప్పారు. 8,329 కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించగా, ఇప్పటికే 7,337 కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. 17.5 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా 9.45 కోట్లు కొత్తవి, 8.05 కోట్లు పాతవి ఏర్పాటుచేస్తున్నామని అన్నారు.

23తో ముగియనున్న 'ఆర్జేసీ సెట్' గడువు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీఆర్జేసీ సెట్ దరఖాస్తుల గడువు ఈ నెల 23తో ముగుస్తుందని సంస్థ కార్యదర్శి రమణకుమార్ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు ఈ నెల 23లోపు http://tgrjc. cgg. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మే 10న నిర్వహించే పరీక్షకు ఇప్పటి వరకు 60వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. వివరాలకు 040-24734899ను సంప్రదించాలని సూచించారు.

- 2 లక్షల రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తరు?



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణాలు మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం ధర్మాపూర్‌కు చెందిన 68 మంది రైతులు శనివారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. - అమరచింత

- బోనస్ డబ్బుల కోసం అధికారుల నిలదీత

ఆదిలాబాద్ జిల్లా పెంబి మండలం మందపల్లిలో శనివారం కాంగ్రెస్ నాయకులు, అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వానకాలం సన్న వడ్లకు సంబంధించి బోనస్ డబ్బులు రాలేదని అక్కడే ఉన్న రైతులు మాద భీమన్న, బొజ్జ గంగన్న అధికారులను నిలదీశారు. - పెంబి

కష్టాల్లో రైతులు.. సంబురంలో సర్కారు!

మొదటిపేజీ తరువాయి...

వానలొచ్చి అది కూడా తడిసిపోయి పనికిరాకుండా పోతున్నది.. రాష్ట్రంలో రైతులు కష్టాల్లో కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వం మాత్రం రైతు మహోత్సవం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. నిజామాబాద్‌లో సోమవారం నుంచి బుధవారం వరకు ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. దీంతో కాంగ్రెస్ సర్కారు, వ్యవసాయ శాఖ తీరుపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. తమ సమస్యలు తీర్చకుండా ఉత్సవాలు నిర్వహిస్తే లాభమేంటని అన్నదాతలు మండిపడుతున్నారు. తమ సమస్యలను తీర్చే నిధులు లేవు, తీరిక లేదు గానీ ఉత్సవాలకు మాత్రం కోట్లకు కోట్ల నిధులు, తీరిక ఎక్కడి నుంచి దొరుకుతున్నదని వారు ప్రశ్నిస్తున్నారు.

సమస్యలు పక్కనపెట్టి.. ఉత్సవాలెందుకు

ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. విత్తనాలు, ఎరువుల కొరత నుంచి మొదలుకొని పండించిన పంట అమ్ముకునే వరకు అడుగడుగునా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా విత్తనాలు, ఎరువులు లభించడం లేదు. దీంతో మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా విత్తనాలు, ఎరువులు కోసం బారులుతీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేతికొచ్చిన పంట అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్నది. నష్టపోయిన రైతులను పరామర్శించి భరోసా ఇచ్చే దిక్కేలేకుండా పోయింది. ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా ఒక్క ఎకరానికి కూడా నష్టపరిహారం ఇవ్వలేదు. ఇక ముందే వరి కోతలు పూర్తయిన రైతులు ఆ ధాన్యం అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారు. రుణమాఫీ, రైతుభరోసా సంగతి తెలిసిందే. యాసంగి పంట కోతలు పూర్తికావడానికి వస్తున్నా.. ఈ సీజన్ రైతుభరోసా పంపిణీని కాంగ్రెస్ సర్కారు పూర్తి చేయలేదు. మొత్తం రూ. 9వేల కోట్లకుగాను రూ.5వేల కోట్లు మాత్రమే జమ చేసి.. రూ. 4వేల కోట్లు ఎగబెట్టింది. ఇవి ఎప్పుడు రైతులకు పంపిణీ చేస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇక రుణమాఫీకి సంబంధించి మొత్తం రూ. 31వేల కోట్లకు రూ.20,616 కోట్లు మాఫీ చేసింది. ఈ విధంగా కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగమాగమైతుంటే... ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఉత్సవాల పేరిట రైతులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టీపీసీసీకి చాంతాడంత జాబితా!

- డీసీసీ అధ్యక్షులుగా ఒక్కో జిల్లా నుంచి ముగ్గురి పేర్లు
- ఉపాధ్యక్షులుగా 24, ప్రధాన కార్యదర్శులుగా 142 పేర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న టీపీసీసీ కార్యవర్గం, డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం భారీ సంఖ్యలో పేర్లను ప్రతిపాదనలు వచ్చినట్టు తెలిసింది. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఒక్కో జిల్లా నుంచి ముగ్గురి పేర్లను పంపినట్టు సమాచారం. మొత్తం 33 జిల్లాలకు గానూ 7 జిల్లాలను పెండింగ్‌లో పెట్టి, మిగిలిన 26 జిల్లాలకు ఏకంగా 76 మంది పేర్లను ప్రతిపాదించినట్టు తెలిసింది. అధికంగా సిద్దిపేట జిల్లా నుంచి ఏడుగురి పేర్లు ప్రతిపాదించినట్టు తెలుస్తున్నది. కాగా ములుగు, నారాయణపేట, నాగర్‌కర్నూల్, భూపాలపల్లి, కామారెడ్డి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు పేర్లను ప్రతిపాదించలేదు. ఇక రాష్ట్ర కార్యవర్గానికి సంబంధించి మొత్తం 168 పేర్లతో జాబితాను పంపినట్టు సమాచారం. ఇందులో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా జాఫర్ జావేద్‌ను ప్రతిపాదించింది. ఇక టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్లుగా 23 మందిని, జనరల్ సెక్రటరీలుగా 142 మంది పేర్లను ప్రతిపాదించినట్టు తెలిసింది. ఈ జాబితాను అధిష్ఠానం ఎప్పుడు ఫైనల్ చేస్తుందనేది స్పష్టత లేదు.

జపాన్ ఏజెన్సీలతో 'టామ్‌కామ్' ఒప్పందం

హైదరాబాద్, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్(తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్) జపాన్‌కు చెందిన రెండు ఏజెన్సీలతో శనివారం సీఎం సమక్షంలో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నది. ఒప్పందం చేసుకున్న ఏజెన్సీల్లో జపాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రత్యేక నైపుణ్యాలకు సంబంధించిన ఉద్యోగుల నియామకాల సంస్థ టెర్న్(టీజీయూకే టెక్నాలజీస్), అలాగే, నర్సింగ్, కేర్‌టేకర్ ఉద్యోగాల భర్తీకి రాజ్ గ్రూప్ ఉన్నాయి. ఈ ఒప్పందం ద్వారా రానున్న రెండేండ్లలో హెల్త్‌కేర్, ఇంజినీరింగ్, హాస్పిటాలిటీ, కన్స్ట్రక్షన్ తదితర రంగాల్లో 500ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ప్రకటనలో తెలిపారు.

రేవంత్‌రెడ్డి పర్యావరణ ప్రవచనం

- కాలుష్యం భారీగా పెరిగి ఢిల్లీ నగరమే స్తంభించిపోయింది
- పార్లమెంట్, స్కూళ్లు, గవర్నమెంట్ ఆఫీసులు మూసేసిన్రు
- హైదరాబాద్‌లో కాలుష్యాన్ని కూడా అలాగే వదిలేద్దామా?
- ఢిల్లీ నుంచి గుణపాఠం నేర్చుకోకపోతే ప్రకృతి క్షమిస్తుందా?
- జపాన్ తెలుగు సమాఖ్య ఆత్మీయ సమ్మేళనంలో రేవంత్‌రెడ్డి
- కంచ గచ్చిబౌలి అటవీ విధ్వంసం సంగతేంటని నెటిజన్ల నిలదీత

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): జపాన్ పర్యటనకు వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడ వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపుతున్నారు. పర్యటనలో అప్పుల వేటలో పలువురు పెద్దలతో సమావేశాలు నిర్వహించిన ఆయన శనివారం ఓ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. జపాన్ తెలుగు సమాఖ్య 'తెలుగు వెలుగుల పండుగ సంబరాలు' పేరుతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "ప్రకృతి మనల్ని క్షమిస్తదా? ఈ రోజు మీ టోక్యో నగరం పొల్యూషన్‌ఫ్రీ సిటీ. మన దగ్గర ఢిల్లీలో పొల్యూషన్‌తోటి పార్లమెంట్, స్కూళ్లు, గవర్నమెంట్ ఆఫీసులు అన్నీ మూసేసిన్రు. అంతపెద్ద నగరాన్ని నిర్మించుకున్న తర్వాత కేవలం కాలుష్యం వల్ల ఢిల్లీ నగరమే స్తంభించే పరిస్థితుంటే మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా? హైదరాబాద్ నగరాన్ని కూడా మనం కాలుష్యమైన నగరంగా అట్లే వదిలేద్దామా?" అని అన్నారు. రేవంత్‌రెడ్డి మాటలపై సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చ జరుగుతున్నది.

మీరే కొట్టి... మీరే ఏడుస్తరా?

జపాన్ తెలుగు సమాఖ్య సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రసంగం వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. కొందరు నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. "అత్త రెండు చేతులను విరగ్గొట్టిన కోడలు... అత్తకు నేను కాకపోతే ఇంకెవరు సేవ చేస్తరు..? నాకు బాధ్యత లేదా..! అన్నదట.. ఈ సామెత చెప్పినట్టే ఉంది.. సీఎం రేవంత్‌రెడ్డి తీరు" అంటూ కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. "నవ్విపోదురుగాక నాకేంటి.... అన్నట్టుగానే రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారు" అని మండిపడుతున్నారు. "ఇదేమి ఇచ్చంత్రముల్లా" అని పేర్కొంటూ కొందరు నెటిజన్లు ముక్కున వేలేసుకుంటున్నారు. "ఈ మాటలు నిన్నమొన్న ఎవరో ఎక్కడో మాట్లాడినట్టు ఉందే...!" అని గుర్తుచేసుకుంటున్నారు.

ఇలాగేనా హైదరాబాద్‌ను కాపాడుకునేది?

ప్రకృతి క్షమిస్తుందా? అని రేవంత్‌రెడ్డి సంధించిన ప్రశ్నపైనా నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఆక్సిజన్ అందించే పచ్చదనాన్ని పారిశ్రామిక అభివృద్ధి పేరిట కాలరాయడం దారుణమని, పాలకులు భవిష్యత్తుకు అందించే వారసత్వ సంపద ఇదేనా? అని పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు... ప్రతిపక్షాలనేతలు ప్రశ్నిస్తున్నారు.

ఢిల్లీ ఉదాహరణ జపాన్‌లో గుర్తొచ్చిందా?

ఇటీవల కంచగచ్చిబౌలిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగించిన అటవీ, పర్యావరణ విధ్వంసం పర్యవసానాలు ఎలా ఉంటాయో వివరించేందుకు ఢిల్లీలోని కాలుష్యం తీవ్రతను పర్యావరణవేత్తలు ఉదహరించారు. దేశరాజధానిలోనే ప్రశాంతమైన గాలి పీల్చుకునే అవకాశం లేకుండాపోయిందని, పర్యావరణ విధ్వంసమే ఇందుకు కారణమని చెప్పారు. పార్లమెంట్, స్కూళ్లు, గవర్నమెంట్ ఆఫీసులు కూడా మూసివేసే పరిస్థితి వచ్చిందని, తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని కూడా ఢిల్లీలా కాలుష్యకాసారంగా మారుస్తుందా? అడవిని నరికివేయడం ఏంటని సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీశారు. జనం ఏవైతే ప్రశ్నలు సంధించారో.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి అవే ప్రశ్నలను జనాలకు వేశారని.. మరి సమాధానం ఎవరు చెప్పాలని నెటిజన్లు నిలదీస్తున్నారు. "ప్రజలు, పర్యావరణవేత్తలు, ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పలేదు? పర్యావరణ విధ్వంసం, వన్యప్రాణి విషాదంపై ప్రశ్నించిన వాళ్లపై కేసులు పెడుతున్నారు. హంతకులే సంతాపం తెలిపినట్టు.. కొట్టినవాడే ఏడ్చినట్టు... ప్రజలు అడిగిన ప్రశ్నలనే... జనాలను రేవంత్ అడిగితే ఏమనుకోవాలి?" అని సోషల్ మీడియాలో జనాలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. "నూరు ఎలుకలు తిన్నపిల్లి తీర్థయాత్రలకు పోయినట్టు" రేవంత్‌రెడ్డి వైఖరి ఉందని మండిపడుతున్నారు. ప్రవచనాలు ఆపి... పర్యావరణాన్ని కాపాడే పని చూడాలని హితవు పలుకుతున్నారు.

విధ్వంసం మీరే చేసి.. విలువలు మీరే చెప్తారా?

ఇటీవల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంచగచ్చిబౌలిలోని 129 ఎకరాల అడవిని మూడు రోజుల్లో నేలమట్టం చేసిన విషయాన్ని నెటిజన్లు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. అడవి కాస్తా మైదానంగా మారిన దృశ్యాలు పర్యావరణ ప్రేమికులను, నగరవాసులను నిర్ఘాంతపోయేలా చేశాయని... సగటు ప్రజలను కలచివేశాయని పేర్కొంటున్నారు. కాంక్రీట్ జంగల్‌గా మారిపోతున్న నగరాల్లో ఓ చెట్టు నీడ కనిపించడమే పెద్ద ఊరట అని, అటువంటిది.. అంతటి అడవిని ఎంతలా కాపాడుకోవాలి కదా అని చెప్తున్నారు. పర్యావరణంపై ప్రేమ ఉంటే అడవిని ఎందుకు నరికివేశారని నిలదీస్తున్నారు.

ఆ రెండు వేల మందికీ నోటీసులిస్తారా?

- వారందరిపైనా ఇలాంటి చర్యలే తీసుకుంటున్నారా?
- లేకపోతే కొందరినే టార్గెట్ చేశారని అనుకోవాలా?
- గచ్చిబౌలి పోలీసులకు ఐఏఎస్ స్మితాసబర్వాల్ ప్రశ్నలు
- రీట్వీట్ కేసులో నోటీసులకు సమాధానమిచ్చినట్టు వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ)/శేరిలింగంపల్లి: కంచ గచ్చిబౌలి అడవుల నరికివేతపై ఏఐ ఫొటో రీట్వీట్ చేశారన్న కేసులో గచ్చిబౌలి పోలీసులు ఇచ్చిన నోటీసుకు సీనియర్ ఐఏఎస్ అధికారి, పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ సమాధానం ఇచ్చారు. ఈ మేరకు శనివారం స్మితా సబర్వాల్ ఆఫీస్‌కు వెళ్లిన గచ్చిబౌలి పోలీసులు ఆమె స్టేట్‌మెంట్‌ను తీసుకున్నారు. మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ఎక్స్ హ్యాండిల్ పోస్టును రీషేర్ చేయడానికి సంబంధించిన వివరణను రికార్డ్ చేశారు. స్టేట్‌మెంట్ ఇచ్చిన తర్వాత స్మితాసబర్వాల్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. చట్టం పరిధిలో పోలీసులకు పూర్తిగా సహకరించినట్టు పేర్కొన్నారు. చట్టానికి కట్టుబడే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులను కొన్ని ప్రశ్నలు అడిగినట్టు చెప్పారు. "ఆ పోస్టును 2 వేల మంది రీషేర్ చేశారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్యలే తీసుకుంటున్నారా? అనే స్పష్టత కోరాను. అలా కాకపోతే ఎంపిక చేసిన కొంతమందినే లక్ష్యంగా చేసుకున్నట్టు అనుకోవాల్సి వస్తుంది. ఒకవేళ అలా జరిగినట్టయితే చట్టం ముందు అందరూ సమానమే అనే సహజన్యాయ సూత్రానికి రాజీపడినట్టే అవుతుంది కదా" అని పేర్కొన్నారు. తన ట్వీట్‌లో #RuleofLaw #FreedomOfSpeech #justsaying అంటూ హ్యాష్‌ట్యాగ్‌లు ఇచ్చారు.

పర్యావరణ విధ్వంసమే!

మొదటిపేజీ తరువాయి...

మాజీ డీజీపీ జూలియో రిబీరో వంటి ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఎఫ్ఎస్ అధికారులు 67 మంది ఈ ప్రకటనపై సంతకం చేశారు. కంచ గచ్చిబౌలిలోని ఆ భూములు అటవీ ప్రాంతం కాదని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తున్నదని, కానీ ఈ వాదన అబద్ధమని పేర్కొనడానికి అనేక ఆధారాలున్నాయని తెలిపారు. చెట్లను కూల్చి, అటవీ ప్రాంతాన్ని చదును చేయడాన్ని వ్యతిరేకించిన హెచ్‌సీయూ విద్యార్థులతో చర్చించడానికి బదులుగా వారి నిరసనలను బలప్రయోగంతో అణచివేయడానికి ప్రయత్నించిందని ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా 100 ఎకరాల్లో బుల్డోజర్లతో చెట్లను నరికేయడం కలచివేసిందని అసహనం వ్యక్తం చేశారు. సర్కారు చర్యలను అన్ని వర్గాల ప్రజలు తప్పుపట్టడంతో చెట్లను నరకడం ఆపేసిందని పేర్కొన్నారు.